క్లుప్తంగా

పల్లకీ ఉత్సవం



స్వామి అమ్మ వార్లకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో స్వామి అమ్మవార్లకు ఆదివారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి షోడశోపచార పూజలు జరిపారు.

మహానందిలో సందడి

● రుద్ర, చండీ, మృత్యుంజయ హోమాలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో శ్రావణ మాసం, ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని స్థానిక కోనేరులలో పుణ్య స్నానాలు ఆచరించి కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారితో పాటు కోదండ రామాలయం, ఆంజనేయస్వామి, వినాయక నంది, గరుడ నంది ఆలయాలు సందర్శించారు. శ్రావణమాసం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆర్జిత సేవా టికెట్లతో మత్యుంజయ హోమం, చండీ హోమం, రుద్ర హోమం నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో హోమాలు జరిగాయి. కామేశ్వరి దేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన పట్టు చీరలకు విక్రయ వేలాలు నిర్వహించగా మహిళలు కొనుగోలు చేశారు.

సీఐటీయూ పట్టణ కమిటీ ఎన్నిక

ఆత్మకూరు: సీఐటీయూ ఆత్మకూరు పట్టణ కమిటీని ఎన్నుకున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షులు యేసురత్నం ఆదివారం పట్టణ అధ్యక్షులుగా సద్దాం, ప్రధాన కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, రజాక్, రైట్ బాషా, సహాయ కార్యదర్శులుగా భారతి, నాగన్న, మల్లయ్య, సుబ్బన్న, కోశాధికారిగా మంజుల, కమిటీ సభ్యులు కలిముల్లా, పుల్లయ్య, శివకుమార్, నాగరాజు, రమిజాబీ, ప్రభావతి, బేగంబీ, లక్ష్మీదేవి, శాంతి తదితరులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

యూటీఎఫ్ నిరంతరం పోరాటం

నందికొట్కూరు: ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ముర్తుజావలి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం యూటీఎఫ్ అనేక పోరాటాలు చేసిందన్నారు. ఉపాధ్యాయ సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పోరాడుతుందన్నారు. పెండింగ్ డీఏలను తక్షణమే ఇవ్వాలని, 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, లోకేష్, మునీంద్ర, వేణు, జగదీష్, పుల్లయ్య పాల్గొన్నారు.

అక్రమార్కులను అరెస్టు చేయాలి

నందికొట్కూరు: మత్స్యశాఖ భూమిని అక్రమించిన వారిని అరెస్టు చేయాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం వాల్మీకి నగర్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూపాడుబంగ్లా, తంగడంచ గ్రామానికి చెందిన స్వాతి, రాధమ్మ, పిచ్చిగుంట్ల ఈశ్వరయ్య, వెంకటరమణతో మరి కొందరు మత్స్యశాఖ భూములను అక్రమించి మామిడి మొక్కలను నాటారన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తుంటే అధికారులు గుడ్లప్పగించి చూస్తున్నారన్నారు. ప్రజా సంఘాలు ధర్నాలు చేసేంత వరకు మత్స్యశాఖ అధికారులకు తెలియడం లేదంటే ఆ శాఖ పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇప్పటికైనా భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, చేప పిల్లల ఉత్పత్తి పునరుద్ధరించి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏసన్న, నరసింహులు, బీబీ, లక్ష్మీదేవి, సోమప్ప, మాబాషా పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కాపర్ వైర్ చోరీ ముఠా

కొలిమిగుండ్ల: కొద్ది రోజుల నుంచి రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో కాపర్ వైర్ చోరీకి పాల్పడుతున్న మీర్జాపురానికి చెందిన ముఠాను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించి రైల్వే లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. హైటెన్షన్ వైర్లను కొద్ది రోజుల నుంచి అపహరిస్తూ సొమ్ము చేసుకునేవాళ్లు. ఈ వైర్ ఖరీదు అయినది కావడంతో ముఠా సభ్యులు తరచూ చోరీకి పాల్పడుతూ ఉన్నారు. ఎట్టకేలకు పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. వారి నుంచి 200 కేజీల వైర్‌తోపాటు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఎనిమిది మంది ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం 27 మంది రెండు గ్రూపులుగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు.

కల్యాణ వేడుక.. ఖరీదైన వేదిక!

● జోరుగా సాగుతున్న పెళ్లిళ్లు
● మధ్య తరగతి ప్రజలపై ధరాఘాతం

నంద్యాల(న్యూటౌన్): శ్రావణ మాసం.. శుభకార్యాలకు పెట్టింది పేరు. మంచి ముహూర్తాలు ఉండటంతో పెళ్లిళ్ల సందడి మొదలైంది. ఇప్పటికే పలు జంటలు ఒక్కటయ్యాయి. మరిన్ని పెళ్లిళ్ల నిర్వహించేందుకు తల్లిదండ్రులు కల్యాణ మండపాలను బుక్ చేసుకున్నారు. కాగా.. పెరిగిన ఖర్చులతో మధ్య తరగతికి కల్యాణం తంతు భారంగా మారింది. ఈ నెలలో ఇప్పటి ఉన్న ముహూర్తాలతో పాటు రానున్న 10, 11, 13, 14, 15, 17, 18 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి, ముఖ్యంగా 13,14 తేదీల్లో అత్యధికంగా పెళ్లిళ్ల జరగనున్నాయి. దీంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. పట్టణంలో వివాహాలకు సంబంధించి కొనుగోళ్లతో వస్త్ర, బంగారు దుకాణాల్లో రద్దీ పెరిగింది. ఇక డెకరేషన్, ఫొటోగ్రఫి, ఈవెంట్లు, క్యాటరింగ్ నిర్వాహకులు, బోటిక్స్, బ్యూటీషియన్లు తీరిక లేకుండా ఉన్నారు..

పెరిగిన ఖర్చులు...

గతంలో వివాహ వేడుకలంటే బ్యాండ్ మేళాలు, భాజా భజంత్రీలు, పూల మండపాలు, ఫొటోలు, వీడియో షూటింగ్‌లు వంటివి ఉండేవి. ప్రస్తుతం ట్రెండ్ మారింది. కొందరు వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు, ప్రీ వెడ్డింగ్ షూట్లకు ప్రకృతి సోయగాలతో పేరున్న ప్రాంతాలకు వెళ్తున్నారు. కాబోయే వధూవరులతో ప్రత్యేక పాటలు చిత్రిస్తున్నారు. కల్యాణ మండపంలో ఎల్ఈడీ స్క్రీన్లను ప్రదర్శించడం, డ్రోన్లతో షూటింగ్ వంటివి చేస్తున్నారు. దీంతో పలు విభాగాల ధరలు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. ముఖ్యంగా కల్యాణ మండపాలు, ఫొటో, వీడియో మేకింగ్, పూలదండలు, కేటరింగ్ తదితరాల నిర్వాహకులు ధరలను పెంచేశారు. దీంతో మధ్య తరగతి వర్గాల వారు పెరిగిన ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నారు.



వేడుకకు సిద్ధంగా ఉన్న కల్యాణ వేదిక

రూ.30 వేల నుంచి లక్షన్నర వరకు..

వరుసగా పెళ్లి ముహూర్తాలు ఉండడంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. మినీ ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాళ్లు పట్టణంలో మొత్తంగా 30కి పైగా ఉండగా, వీటితో పాటు ఆలయాల్లో ఉన్న హాల్స్ కూడా బుక్ అయిపోయాయి. ఫంక్షన్ హాళ్ల బట్టి అద్దెలు వసూలు చేస్తున్నారు. మినీ ఫంక్షన్ హాల్ అయితే అద్దె రూ.30వేల నుంచి రూ.1.50లక్షల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. ఇవి కాకుండా పూల డెకరేషన్, లైటింగ్, భోజనాల ఖర్చు వంటి వాటితో కలిపి ప్రస్తుతం మినీ ఫంక్షన్ హాల్ రూ.2.50 లక్షలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. పెద్ద కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాల్స్‌కు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఇక పెళ్లి మొత్తం ఫొటోలు, వీడియో చిత్రీకరణకు రూ.80వేల నుంచి రూ.2.5లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఎంత తక్కువలో వెళ్దామనుకున్నా.. రూ.50వేలకు తక్కువ కావడం లేదు. ఇక పూల దండలు రోజుకో ధర, పూలను బట్టి వసూలు చేస్తున్నారు. ఇక వాహనాల అద్దె, పందిరి వేయడం, ఇంటి వద్ద భోజనాలు, వస్త్రాలు, ఆభరణాలకు భారీగా వెచ్చించాల్సి వస్తోంది. దీంతో కల్యాణ వేడుక..ఖరీదైన వేదికగా మారిందని మధ్యతరగతి వర్గాలు వాపోతున్నాయి.

ఘనంగా శివపద సంకీర్తనోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈఓ



శివపద కార్యక్రమంలో భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో శ్రావణ మాసోత్సవాలలో భాగంగా శివపద సంకీర్తనోత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రవచన కర్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారు రచించిన 'శివపదం' సంకీర్తనలను ప్రముఖ నేపథ్య గాయకులైన నిహాల్, బృందం ఆలపించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరిపించాలనే భావనతో దేవస్థానం నిత్య కళారాధనగా ప్రతీరోజు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హరికథ, సంప్రదాయనత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని, గాత్ర కచేరి లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంచి కళాకారులను దేవస్థానం ప్రోత్సహిస్తోందన్నారు. శ్రావణమాసోత్సవాలను పురస్కరించుకుని శివపదం సంకీర్తన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ తదేకదీక్షతో రోజుకొకటి తక్కువ కాకుండా శివార్పణంగా శివకీర్తనలను రచించారన్నారు. ఈ కీర్తనలే 'శివపదం' పేరుతో ప్రసిద్ధి చెందాయన్నారు. నేపథ్యగాయకులు నిహాల్ బృందంలోని జె.వి.ఎస్. ఆర్.ఎస్. ప్రసాద్, సర్వజ్ఞ, కార్తిక, శర్మిష్ట, తన్విక్తి శృతి ఆయా సంకీర్తనలను ఆలపించారు. గణపతయే గణపతయే, శివ శివ మహాలింగ, పార్వతీశంకరులు, నమశ్శివాయ, ఆది ప్రదోషవేళ, పంచామృతాలతో, శివకామసుందరీ, నమో నమో ఉమాపతీ మొదలైన కీర్తనలను గాయనీ గాయకులు ఆలపించారు. కార్యక్రమానికి మృదంగ సహకారాన్ని టి.పి. బాలసుబ్రహ్మణ్యం, వయోలిన్ సహకారాన్ని కౌండిన్య అందించారు.

రేపు ఎన్‌జీజీఓస్ నేతల రాక

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఈ నెల 12న కర్నూలుకు రానున్నారు. ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడైన వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి జిల్లా ట్రెజరీలో సీనియర్ అకౌంటెంటుగా పని చేస్తూ జూలై 31న పదవీ విరమణ పొందారు. అదే రోజున ట్రెజరీ అధికారులు, ఉద్యోగులు ఆయన్ను సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ క్రమంలో ఈ నెల 12న జిల్లా ఎన్‌జీజీఓస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలులోని బిర్లాగేట్ సమీపంలోని లక్ష్మీఫంక్షన్ హాల్‌లో సన్మానసభ జరగనుంది. ఈ కార్యక్రమానికి ఎన్‌జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, రాష్ట్ర సహ అధ్యక్షులు దస్తగిరిరెడ్డి కూడ హాజరు కానున్నారు. 20 ఏళ్లపాటు జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన వెంగళ్‌రెడ్డిని సత్కరించిన అనంతరం కర్నూలు, నంద్యాల జిల్లాలకు వేరువేరుగా అడ్‌హక్ కమిటీలను రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ ప్రకటించే అవకాశం ఉంది. జిల్లా ఎన్‌జీజీఓస్ అసోసియేషన్ కార్యవర్గం పదవీ కాలం జూలై 10వ తేదీతోనే ముగిసింది. అందువల్ల అడ్‌హక్ కమిటీల ఏర్పాటు అత్యవసరం అయింది. ఆరేడు నెలలుగా జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వెంగళ్‌రెడ్డిపై సంఘంలోని వారే తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. రాష్ట్ర సంఘానికి ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో అడ్‌హక్ కమిటీలో ఎవరి ముద్ర ఉంటుందనేది చర్చనీయాంశం అయ్యింది. కర్నూలు జిల్లాకు అడ్‌హక్ కమిటీ చైర్మన్‌గా ఎంసీ కాశన్నను ప్రతిపాదిస్తున్నారు. ఈయన వ్యవసాయ శాఖలో జూనియర్ అసిస్టెంటుగా పని చేస్తూ కర్నూలు నగర శాఖ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

గజదొంగ అరెస్ట్

● 16 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న కర్నూలు టౌన్ డీఎస్పీ బాబుప్రసాద్, సీఐలు

కర్నూలు (టౌన్): చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. గత కొంతకాలంగా కర్నూలు నగరంలోని కొత్తబస్టాండ్ వద్ద ప్రయాణికుల బ్యాగుల దొంగతనాలు జరుగుతున్నాయి. బాధితులు నాలుగవ పట్టణ పోలీసులకు, ఆర్టీసీ బస్టాండ్ పోలీసులకు ఫిర్యాదులు చేశారు. కేసులు నమోదు చేసుకున్న పోలీసులు బ్యాగ్ లిఫ్టింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడు నంద్యాల పట్టణంలో ఉన్నట్లు గుర్తించారు. డీఎస్పీ నేతృత్వంలో కర్నూలు నాలుగవ పట్టణ సీఐ విక్రమసింహా, ఎస్ఐ మోహన్ కిషోర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఎస్‌ఏ.ఖాద్రి, ఎస్.షాకీర్, కానిస్టేబుల్ ఎల్లా శివుడు, సుబ్బరాయుడు, లక్ష్మణ్, నాయక్ ప్రత్యేక బృందంగా ఏర్పడి నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సిద్దాపురం గ్రామం రాములవారి వీధికి చెందిన గున్న అంజిని అరెస్టు చేసినట్లు కర్నూలు టౌన్ డీఎస్పీ బాబుప్రసాద్ ఆదివారం తన కార్యాలయంలో వెల్లడించారు. నిందితుడి నుంచి 16 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారు అభరణాలను సంబంధిత యజమానులకు కోర్టు ద్వారా అప్పగిస్తామని డీఎస్పీ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

తుగ్గలి: ఐదు రోజుల క్రితం తప్పిపోయిన మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. రాతనకు చెందిన రాఘవరెడ్డి(65) ఈనెల 6న బళ్లారిలో జరిగిన బంధువుల పెళ్లికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. మానసికస్థితి సరిగా లేని ఆయన అక్కడ తప్పిపోయారు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఆలూరు బస్టాండ్‌లో అచేతనంగా పడి ఉన్న ఆయనను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నీరసించిపోయిన ఆయన చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

దేవరగట్టులో శ్రావణమాస పూజలు

హొళగుంద: శ్రావణమాస మూడో ఆదివారంలో భాగంగా దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకాం, బండారార్చన, పుష్పార్చన, మహామంగళ హారతి, ఆకుపూజ, నివేదన, నిరాజనం తదితర పూజలు చేపట్టారు. చివరగా ఆలయ పూజారులు విరాట్‌మూర్తులకు నైవేద్యం సమర్పించారు.

కుక్కల బెడదను అరికట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్

ఆత్మకూరు: పట్టణంలో నెలకొన్న కుక్కల బెడదను అరికట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, గరీబ్ నగర్ శాఖ కార్యదర్శి ఎ.సురేంద్ర అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుదర్శన వర్మ భవన్‌లో ఏర్పాటు చేసిన సీపీఎం గరీబ్‌నగర్ శాఖ సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వీధుల్లో ప్రజలపై, చిన్నారులపై, వృద్ధులపై వీధి, పిచ్చి కుక్కలు దాడి చేశాయన్నారు. వారంతా ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారన్నారు. ఇలా ప్రతిరోజూ పట్టణంలో ఎక్కడో ఒకచోట ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు నివారణ చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడదను అరికట్టాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు జి.నాగేశ్వరరావు, వీరన్న, తుమ్మలూరు శివకుమార్, రమణ, మియాన తదితరులు పాల్గొన్నారు.

బంగారు పడిగె వితరణ



బంగారు పడిగెను అందిస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి దాతలు 10 గ్రాముల బంగారు పడిగెను బహుకరించినట్లు ఈఓ రామక్రిష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బనగానపల్లె పట్టణానికి చెందిన నవీన్‌కుమార్, గీత దంపతులు తమ ఇలవేల్పు స్వామి వారికి 10 గ్రాముల బంగారు పడిగెను బహూకరించారన్నారు. పడిగె విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు. దాతల కుటుంబసభ్యులకు ఆలయ మర్యాదలతో శేషవస్త్రాలు అందించినట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద

కర్నూలు సిటీ: ఎగువ రాష్ట్రంతో పాటు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర నదికి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం సుంకేసుల బ్యారేజీకి ఉదయం 6 గంటలకు 72 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా సాయంత్రానికి 70 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. బ్యారేజీ నుంచి 66,176 క్యూసెక్కుల నీటిని 16 గేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కేసీ కాలువకు 2,012 క్యూసెక్కుల నీటిని పంపిణీ చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

కొత్తపల్లి: ఆత్మకూరు ఆర్టీసీ డిపో స్వీపింగ్, వాషింగ్ సెక్షన్ కాంట్రాక్టు కార్మికురాలు దళిత లక్ష్మిని కులం పేరుతో దూషించిన ఆర్టీసీ సెక్యూరిటీ గార్డ్ కరిమున్నీసాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.సంపత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. స్వాములు, సీఐటీయూ మండల నాయకులు నక్క ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యం విచారణ జరిపి కరిమున్నీసాను ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సార్బీసీలో వ్యక్తి గల్లంతు

పాణ్యం: మండల కేంద్రలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో వ్యక్తి గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. నాగపూర్ నుంచి వేలూరుకు కెమికల్ లోడ్‌తో లారీ బయలుదేరగా పాణ్యం సమీపంలో ఎస్సార్బీసీ కాల్వ వద్ద నిలిపి డ్రైవర్ స్నానం చేయడానికి కాల్వలో దిగాడన్నారు. ప్రమాదవశాత్తు కాల్వలో జారి పడి గల్లంతైనట్లు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు

పగిడ్యాల: చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముచ్చుమర్రి స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఐ తిరుపాలు హెచ్చరించారు. ఆదివారం తెల్లవారుజామున పగిడ్యాలలో స్పెషల్ పార్టీ బలగాలతో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. కేసీ కెనాల్ బ్రిడ్జి సమీపంలోని బరక కాలనీ, దేవనగర్ కాలనీ, బస్టాండు ఏరియా, రౌడీషీటర్ల ఇళ్లతో పాటు అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం బస్టాండులో నిర్వహించిన గ్రామ సభలో ఇన్‌చార్జ్ ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని విడిచి పెట్టే ప్రసక్తే లేదన్నారు. ప్రజలకు అన్యాయం జరిగితే స్టేషన్‌ను ఆశ్రయించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదని సూచించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ ఎస్ఐ తిరుపాలు

మాట తప్పిన కూటమి నేతలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

పాములపాడు: ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు విమర్శించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆటో జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పగలగొట్టండి అని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారన్నారు. ప్రజలను నమ్మించి మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఘనుడన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, నాయకులు బాలయ్య, రమణ, నారాయణ, రాజు, పురుషోత్తం పాల్గొన్నారు.

ఇంజిన్ బోట్లు నడిపితే నాన్‌బెయిలబుల్ కేసులు



మూర్వకొండ ఘాట్ వద్ద రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం

పగిడ్యాల: శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో ఇంజిన్ బోట్ల నడిపతే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. ఆదివారం నెహ్రూనగర్ సమీపంలోని మూర్వకొండ ఘాట్, అర్లపాడు ఘాట్‌లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోందన్నారు. నది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మూర్వకొండ, అర్లపాడు ఘాట్‌ల నుంచి తెలంగాణ రాష్ట్రంలోని మంచాలకట్ట, పెంటవెల్లి, కొల్లాపూర్, నాగర్‌కర్నూలు, చెల్లపాడు, చెన్నంబావి, అయ్యవారిపల్లె, వీపనగండ్ల, సోమశిల తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు శ్రీశైలం బ్యాక్‌వాటర్ మీదుగా ఇంజిన్ బోటు ప్రయాణం చేయొద్దన్నారు. రోడ్డు మార్గాన వెళ్లాలని సూచించారు. పోలీసుల ఆదేశాలను బేఖాతర్ చేస్తే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి, బోట్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్‌బాబు

పాములపాడు: టీనేజీలో పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని ఎస్ఐ సురేష్‌బాబు సూచించారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటరులో 'బాల్యాన్ని బలి తీసుకుంటున్న డ్రగ్స్ .. మత్తులో పిల్లలపై అఘాయిత్యాలు' అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లల పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ చెడు అలవాట్ల జోలికి వెళ్లకుండా మంచిని వివరిస్తూ ఉండాలన్నారు. విద్యలో రాణించి భవిష్యత్తు బంగారు బాటగా మలుచుకునేలా సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.

ఉరుకుంద.. భక్తులతో కిటకిట



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి



అన్వేటి మంరం నుంచే క్యూలైన్‌లో వస్తున్న భక్తులు



పొర్లదండాలతో స్వామిని చేరుకుంటున్న భక్తుడు

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మూడవ సోమవారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం ఉదయం నుంచే భక్తులు తరలివచ్చారు. మూడవ సోమవారం అంటేనే ఉరుకుందకు సుమారు 2 నుంచి 3లక్షల మంది భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించుకుంటరన్న అంచనా. అంతేకాక మూడవ సోమవారం మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈరోజు ఆప్షన్ హాలిడే కూడా ఇస్తారు. దీంతో సోమవారం రోజు అధికంగా ఉంటారని భావించిన చాల మంది భక్తులు ఆదివారం నుంచి తరలివస్తుండడంతో క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, విఐపీ దర్శనల ద్వారా భక్తులకు సౌకర్యం కల్పించడంతో దర్శనం సాఫీగా సాగుతున్నది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాత్రంతా దర్శనాలు ఉంటాయని రాత్రి 12గంటల అనంతరం పూజల కోసం అరగంట పాటు దర్శనాలు ఉండవని ఆలయ డిప్యూటి కమిషనర్ వాణి తెలిపారు.

రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితిలో జిల్లా వాసులకు స్థానం

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర నూతన కమిటీలో నంద్యాల జిల్లా వాసులు ఎన్నికైనట్లు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రం విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం విజయవాడ ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి (నంద్యాల), కార్యవర్గ సభ్యులుగా బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి (బేతంచెర్ల)ని నియమించినట్లు తెలిపారు.

ఉరుకుంద డీసీగా వాణి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్‌గా వాణి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న విజయరాజును కసాపురం ఆంజనేయస్వామి దేవాలయానికి బదిలీ కాగా.. అక్కడ పని చేస్తున్న వాణిని ఉరుకుందకు ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో వాణి ఆదివారం విజయరాజు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఈరన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్తులు, సిబ్బందిని, వివిధ రూపాల్లో స్వామి వారికి విరాళాలు ఇచ్చిన దాతలను, భక్తులను కలుపుకుని పోయి దేవాలయ అభివృద్ధికి పాటుపడుతానన్నారు. ఆలయంలో ఏ అర్చకుడైనా తట్టా పెడితే కఠిన చర్యలు ఉంటాయని ఘాటుగా హెచ్చరించారు.